మన రాజధాని

APTEL/25/A5250

రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

29.10.2026 గురువారం | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 97 | పేజీలు : 8 Pages : 4 | వెల : 4 | Published from : గుంటూరు

అమ్మాయిలు అదరహో..
జింబాబ్వేపై భారత్ క్లీన్ స్వీప్

4 పేజీలో

ఎన్నికల షెడ్యూల్‌లో
మార్పులు

- నవంబరు 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్
- 6న రీపోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు
- మున్సిపల్ కౌంటింగ్, పరిషత్ ఎన్నికలకు సిబ్బంది కొరతే కారణం

2 పేజీలో

‘స్థానిక ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది! ఒకే రోజు మున్సిపల్ ఓట్ల లెక్కింపు, పరిషత్ ఎన్నికల పోలింగ్ నిర్వహణతో సిబ్బంది కొరత తలెత్తే అవకాశం ఉండటంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను వాయిదా వేసింది. నవంబరు 3న జరగాల్సిన పోలింగ్‌ను 5వ తేదీకి మార్చింది. అవసరమైతే 6న రీపోలింగ్, 7న ఓట్ల లెక్కింపు చేపట్టనుంది. తుఫాను ప్రభావిత జిల్లాల పరిస్థితులను సమీక్షించిన అనంతరం మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను మాత్రం నవంబరు 1న యథావిధిగా నిర్వహించాలని నిర్ణయించింది.’

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ

మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు

భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

వివరాలు 2లో

‘ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?’

రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

టాటా వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆరోపణలు

రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్

ప్రతిచోటా దెయ్యాలను వెతకొద్దంటూ చురకలు

వ్యాపార అంశాలను రాజకీయాల్లోకి లాగొద్దని హితవు

కాంగ్రెస్ లైసెన్స్-కోటా విధానంపై విమర్శలు

.. వివరాలు 2లో

తుఫాను బీభత్సం
తీరని విషాదం!

- కోనసీమలో కరెంటు స్తంభాల ఊచకోత..
- ఉత్తరాంధ్రలో రహదారుల విధ్వంసం
- 81 వేల హెక్టార్లకు పైగా పంటలకు దెబ్బ..
- 180 ఇళ్లకు నష్టం..
- జిల్లాలవారీగా నష్టం లెక్కల్లో అధికార యంత్రాంగం

2 పేజీలో

‘అర్నవ్ తుఫాను ఆంధ్రప్రదేశ్‌పై విరుచుకుపడి అపార నష్టాన్ని మిగిల్చింది. తుఫాను తీరం దాటినా.. దాని బీభత్సం నుంచి రాష్ట్రం ఇంకా కోలుకోలేదు. కోనసీమలో వేలాది విద్యుత్తు స్తంభాలు నేలకొరగగా.. గోదావరి జిల్లాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఉత్తరాంధ్రలో రహదారులు ధ్వంసమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 81 వేల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇళ్లు, విద్యుత్తు వ్యవస్థ, రహదారులకు జరిగిన నష్టం ఆందోళన కలిగిస్తోంది. ఓవైపు సహాయక చర్యలు.. మరోవైపు నష్ట గణనతో అధికార యంత్రాంగం తలమునకలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తుండగా.. బాధితులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.’

అమరావతి రక్షణ బ్యూరో. ..

ఒకవైపు నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు.. మరోవైపు నీట మునిగిన పంట పొలాలు.. ఇంకోవైపు తెగిపోయిన రహదారులు.. అర్నవ్ తుఫాను ఆంధ్రప్రదేశ్‌కు మిగిల్చిన విషాద దృశ్యాలివి! బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను తీరాన్ని దాటినా.. దాని ప్రభావంతో ఏర్పడిన నష్టం మాత్రం వెంటాడుతోంది. కోనసీమలో విద్యుత్తు వ్యవస్థ ఛిన్నాభిన్నం కాగా..

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు..
కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?:
మోదీ సెటైర్

నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు

12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం

ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

.. వివరాలు 2లో

తుపాను వేళ ఏపీకి అండగా
తెలంగాణ ప్రభుత్వం..

సాయానికి సిద్ధమన్న భట్టి

2 లో

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

పులివెందుల ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ సవాళ్లు: మంత్రి సత్యకుమార్

ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ హింసను రెచ్చగొడుతున్నారన్న సత్యకుమార్

నామినేషన్లప్పుడు కనిపించకుండా, ఇప్పుడు సవాళ్లు విసురుతున్నారని విమర్శ

ప్రజాస్వామ్యవాదిగా మారాలని జగన్‌కు హితవు

2 పేజీలో

అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం
భారీ పరిహార ప్యాకేజీ

- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం
- తుఫాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం
- ప్రతీ బాధితుడికి పారదర్శకంగా సాయం అందిస్తామని చంద్రబాబు హామీ

2 పేజీలో

రక్షణ బ్యూరో. ..

అర్నబ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని, నష్టపోయిన చివరి వ్యక్తికి కూడా న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తుపాను అనంతర సహాయక చర్యలు, నష్టపరిహారంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుపాను బాధితుల

వైసీపీ ఓటు బ్యాంక్ ఇంకా తగ్గాలి..

రాష్ట్రం బాగుపడాలంటే అదే మార్గం: సీఎం చంద్రబాబు

45 వేల మంది నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యంగా పనిచేయాలని చంద్రబాబు పిలుపు

‘రెబల్స్‌గా పోటీ చేస్తే సహించేది లేదు,

అది కూటమి ధర్మానికి విరుద్ధం’

సీట్లు రాని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ

‘గొడ్డలి పార్టీ’ కుట్రలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచన

డబుల్ ఇంజిన్ సర్కారును ట్రిపుల్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యం



2 లో

తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి

అధికారులకు పవన్ ఆదేశం

- అర్నబ్ తుపాను సహాయక చర్యలపై జిల్లాల కలెక్టర్లతో పవన్ కళ్యాణ్ సమీక్ష
- సహాయ చర్యలు వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు
- విద్యుత్, రహదారులను వెంటనే పునరుద్ధరించాలని సూచన
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని నష్టంపై ప్రత్యేకంగా ఆరా తీసిన పవన్ కల్యాణ్

2 లో

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

మొదటి పేజీ తరువాయి

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు."భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

తుఫాను బీభత్సం

మొదటి పేజీ తరువాయి

గోదావరి జిల్లాల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు రహదారులను దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 81 వేల హెక్టార్లకు పైగా పంటలు ప్రభావితమయ్యాయి. సుమారు 180 ఇళ్లు దెబ్బతిన్నాయి. రహదారులు, విద్యుత్తు వ్యవస్థకు జరిగిన నష్టం ఆందోళన కలిగిస్తోంది. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండగా.. క్షేత్రస్థాయిలో నష్టం ఎంతన్నది తేల్చేందుకు అధికారులు లెక్కలు తీస్తున్నారు.

కోనసీమలో విద్యుత్తు వ్యవస్థ కుప్పకూలి..

తుఫాను దెబ్బకు అత్యధికంగా ప్రభావితమైన ప్రాంతాల్లో కోనసీమ ఒకటి. బలమైన ఈదురుగాలులకు వేలాది విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. జిల్లా అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 6,000 విద్యుత్తు స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. కొబ్బరి తోటలు, ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్లకు నష్టం వాటిల్లడం, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో ప్రజల సాధారణ జీవనం అస్తవ్యస్తమైంది. విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం, రహదారులపై అడ్డంకులను తొలగించడం అధికారులకు పెద్ద సవాలుగా మారింది.

గోదావరి జిల్లాల్లో రైతన్నకు కన్నీరే!

గోదావరి డెల్టాలో వరి పొలాల్లోకి వరదనీరు చేరడం రైతులను కలవరపెడుతోంది. కోతకు సిద్ధమవుతున్న పంటలు నీట మునిగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులకు ఆర్థిక భారం తప్పేలా లేదు. తూర్పుగోదావరి జిల్లాలో రహదారుల పునరుద్ధరణకు సుమారు రూ.29.42 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లాల్లోనూ చెట్లు కూలిపోవడం, విద్యుత్తు సరఫరాకు అంతరాయం, రవాణా సమస్యలు తలెత్తాయి. వ్యవసాయ భూముల్లో నిలిచిన నీరు పూర్తిగా తొలగిన తర్వాతే పంట నష్టం తీవ్రతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

శ్రీకాకుళంలో రహదారులకే భారీ దెబ్బ

తుఫాను ప్రభావంతో ఉత్తరాంధ్రలో రహదారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 126 కిలోమీటర్లకు పైగా రహదారులు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటిలో శ్రీకాకుళం జిల్లాలోనే 111.665 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలోనూ 14.5 కిలోమీటర్ల మేర రహదారులకు నష్టం వాటిల్లింది. రహదారులు, కల్వర్టుల పునరుద్ధరణకు రూ.59.45 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.9.18 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.50.27 కోట్లు అవసరమని గుర్తించారు.

విజయనగరం, విశాఖలో వర్ష బీభత్సం

విజయనగరం జిల్లాలోని గరివిడి, ఎస్.కోట, వేపాడ, చీపురుపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో 25 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. విశాఖపట్నం నగరంలోనూ లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అనకాపల్లి జిల్లాలో చెట్లు కూలిపోవడంతో రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలం తాడిగూడ వద్ద పాత వంతెన కొట్టుకుపోవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక వసతులను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

81 వేల హెక్టార్లలో పంటలకు దెబ్బ

తుఫాను నష్టం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 81,350 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు ప్రాథమిక అంచనాల్లో వెల్లడైంది. ఇందులో వరితో పాటు ఉద్యాన పంటలు కూడా ఉన్నాయి. సుమారు 180 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే ఇవి ప్రాథమిక గణాంకాలే కావడంతో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేం. పంటలు, ఇళ్లు, విద్యుత్తు వ్యవస్థ, రహదారులకు జరిగిన నష్టాన్ని విడివిడిగా అంచనా వేసేందుకు శాఖలవారీగా సర్వేలు చేపట్టారు.

28 వేల మందికి పునరావాసం

తుఫాను ముప్పును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. సుమారు 28 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రభుత్వ నివేదికల్లో పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభావిత జిల్లాల్లో మోహరించి సహాయక చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు కూలిన చెట్లను తొలగించడం, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం, రహదారులను బాగుచేయడంపై దృష్టి సారించారు.

సీఎం సమీక్షలు.. పరిహారంపై బాధితుల ఆశలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుఫాను పరిస్థితులపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి చేసి నష్టం వివరాలను సమగ్రంగా రూపొందించాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులకు, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు అండగా నిలవడంతో పాటు మౌలిక వసతులను త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.తుఫాను వెళ్లిపోయింది.. కానీ నష్టం మిగిల్చిన గాయాలు ఇంకా మానలేదు. కోనసీమలో విద్యుత్తు వ్యవస్థను పునరుద్ధరించడం, గోదావరి జిల్లాల్లో పంటలను కాపాడుకోవడం, ఉత్తరాంధ్రలో రహదారులను బాగుచేయడం ఇప్పుడు ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ప్రాథమిక అంచనాలు పూర్తిస్థాయి నష్టాన్ని ప్రతిబింబిస్తాయా? బాధితులకు ఎంత పరిహారం అందుతుంది? అన్నది తేలాల్సి ఉంది. తుది నివేదిక వెలువడితేనే ఈ ప్రకృతి విపత్తు రాష్ట్రానికి మిగిల్చిన ఆర్థిక నష్టం ఎంతన్నది స్పష్టమవుతుంది.

ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తేదీని నవంబరు 3 నుంచి 5వ తేదీకి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అవసరమైతే నవంబరు 6న రీపోలింగ్ నిర్వహించనుండగా.. నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టనుంది. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, పరిషత్ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు ఉండటంతో పోలీసు, ఎన్నికల సిబ్బంది అందుబాటుపై తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అక్టోబరు 28న సవరించిన నోటిఫికేషన్ జారీ చేశారు.

సిబ్బంది సర్దుబాటులో ఇబ్బందులు

రాష్ట్రంలో రెండో సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబరు 19న నోటిఫికేషన్ జారీ చేసింది. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నవంబరు 3న పోలింగ్, 4న అవసరమైన చోట రీపోలింగ్, 5న ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉంది. అయితే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు కూడా నవంబరు 3న జరగనుంది. రెండు కీలక ఎన్నికల ప్రక్రియలు ఒకేసారి నిర్వహించాల్సి రావడంతో అవసరమైన పోలీసు బలగాలు, పోలింగ్ సిబ్బందిని సమకూర్చడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఎన్నికల సంఘం గుర్తించింది. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, సిబ్బందిని సమర్థంగా వినియోగించుకునేందుకు షెడ్యూల్‌ను సవరించింది.

తుఫాను ప్రభావంపై సమీక్ష

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తుఫాను ప్రభావంతో నెలకొన్న పరిస్థితులపైనా రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో చర్చించింది. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, అధికారులు ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌ను వాయిదా వేయాల్సిన అవసరం లేదని నిర్ణయించింది. దీంతో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నవంబరు 1న యథావిధిగా జరగనుంది. అయితే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబరు 3న నిర్వహించనున్న నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు అనివార్యమయ్యాయి.

సవరించిన షెడ్యూల్ ఇదీ..

రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నం. 905/రాజుజ-దీ1/2026 ప్రకారం నవంబరు 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. అవసరమైతే నవంబరు 6న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 మండలాల్లో 44 పోలింగ్ కేంద్రాలు, పోలవరం జిల్లాలోని 7 మండలాల్లో 44 పోలింగ్ కేంద్రాలు.. మొత్తం 88 కేంద్రాల్లో పోలింగ్ సమయం మధ్యాహ్నం 3 గంటలకే ముగియనుంది. అవసరమైతే రీపోలింగ్ కూడా ఆయా కేంద్రాల్లో అదే సమయానికి ముగుస్తుంది.

తేదీల మార్పుపై విస్తృత ప్రచారం

ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులను అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన తేదీలను గమనించాలని సూచించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను కొత్త షెడ్యూల్‌కు అనుగుణంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్ అధికారులు అక్టోబరు 27న ప్రచురించగా, ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాల ఫలితాలను కూడా ప్రకటించారు. తాజా మార్పులతో పరిషత్ ఎన్నికల ప్రక్రియ నవంబరు 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనతో ముగియనుంది.

అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ

మొదటి పేజీ తరువాయి

కోసం ప్రభుత్వం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఇళ్లు, పంటలు, పశువులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని, వీలైనంత వేగంగా పరిహారం అందించి వారిని తిరిగి నిలబెడతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్యాకేజీ పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని సీఎం తెలిపారు. తక్షణ సహాయం కింద తుపాను ప్రభావిత కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు.

తక్షణ సహాయం మరియు ఇళ్ల నష్టపరిహారం

తుపాను కారణంగా ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం.

మత్స్యకారులు మరియు చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం. ప్రతి కుటుంబానికి కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కెర, కేజీ బంగాళదుంపలు ఉచితంగా పంపిణీ.తక్షణ ఖర్చుల కోసం ఒక్కో కుటుంబానికి రూ. 1000 నుంచి గరిష్టంగా రూ. 3000 వరకు ఆర్థిక సహాయం.తుపాను కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా. పాక్షికంగా ఇల్లు దెబ్బతింటే రూ. 10,000 ఆర్థిక సహాయం.

వ్యాపారాలు, జీవనోపాధికి చేయూత

చిన్న కిరాణా షాపులు, రెస్టారెంట్లు, సర్వీస్ షాపులకు రూ. 25,000. చేతివృత్తుల వారికి జీవనోపాధి నష్టానికి రూ. 25,000. తోపుడు బండ్లకు రూ. 20,000. ఎంఎస్ఎంఈ పరిశ్రమలు (రూ. 40 లక్షల టర్నోవర్ వరకు): రూ. 50,000. పరిశ్రమలు (రూ. 40 లక్షల నుంచి రూ. 1.5 కోట్ల టర్నోవర్): రూ. 1 లక్ష. పరిశ్రమలు (రూ. 1.5 కోట్ల టర్నోవర్ పైబడినవి): రూ. 1,50,000. దెబ్బతిన్న ద్విచక్ర వాహనానికి రూ. 3000దెబ్బతిన్న ఆటోకు రూ. 10,000.

మత్స్యకారులకు నష్టపరిహారం

వలలు పాక్షికంగా దెబ్బతింటే మరమ్మతులకు రూ. 5000, రీప్లేస్‌మెంట్‌కు రూ. 10,000.

మెకనైజ్డ్ కాని బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 20,000.

మెకనైజ్డ్ బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 25,000.

చేపల చెరువుల పునరుద్ధరణకు రూ. 18,000.

పశు నష్టపరిహారం... ఆవు/గేదె మరణిస్తే: రూ. 50,000

దూడలకు: రూ. 25,000 ,,గొర్రె/మేక: రూ. 7,500 ,,,కోడికి రూ. 100 (ఒక లబ్ధిదారునికి గరిష్ఠంగా రూ. 10,000). ,,పశువుల షెడ్ దెబ్బతింటే: రూ. 5,000.

వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టపరిహారం (హెక్టారుకు)

రూ. 75,000: తమలపాకు

రూ. 35,000: అరటి, పసుపు, యమ్, మిరప, జామ, బొప్పాయి, మామిడి, కాఫీ, యాపిల్ బేర్, సపోటా, కాజు, డ్రాగన్ ఫ్రూట్. రూ. 25,000: పత్తి, వేరుశనగ, వరి, కూరగాయలు, టమాటో, పూలు, ఉల్లి, పుచ్చ, నర్సరీ, దానిమ్మ, కొత్తిమీర. రూ. 25,000: చెరకు (మొదటి పంట) రూ. 15,000: సజ్జ, మినుములు, పెసలు, మొక్కజొన్న, రాగి, కంది, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, జనుము, కొర్ర, సామ.

ఆయిల్ పామ్, కొబ్బరి: ఒక్కో చెట్టుకు రూ. 1500

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా మొదటి ప్రాధాన్యత ప్రాణనష్టాన్ని నివారించడం. అయినప్పటికీ ఐదుగురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి" అని అన్నారు. మూడు రోజుల్లో ఎనిమిది సార్లు సమీక్షలు నిర్వహించి, టెక్నాలజీని వాడుకుని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. తుపాను తీరం దాటిన అయిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు. రెండు, మూడు రోజుల్లో కోనసీమ, పశ్చిమ గోదావరి మినహా అన్ని జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశామని, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను కేంద్రానికి పంపి, కేంద్ర బృందాన్ని పంపమని కోరినట్లు తెలిపారు. రేపు, ఎల్లుండి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధితులకు భరోసా కల్పిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాధ్యత గల ప్రభుత్వంగా ప్రజల కష్టాల్లో సర్వశక్తులు ఒడ్డి అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వైసీపీ ఓటు బ్యాంక్ ఇంకా తగ్గాలి..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో వైసీపీ ఓటు బ్యాంకు ఇప్పటికే గణనీయంగా తగ్గిపోయిందని, రాష్ట్రం బాగుపడాలంటే ఆ ఓటు బ్యాంకు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసమే ఎన్డీఏ కూటమి శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 45 వేల మంది ముఖ్య నేతలు, కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఓటు బ్యాంకు పతనం రాష్ట్ర ప్రగతికి సూచికగా మారాలని ఆకాంక్షించారు. గొడ్డలి పార్టీ చతికిల పడిందని, ఆ పార్టీ అధినేత ఒక తీవ్రవాదిలా "హిట్ అండ్ రన్" తరహా రాజకీయాలు చేస్తున్నారని, బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఆయన ధ్యాసంతా ప్రజల సంక్షేమంపై కాకుండా, ఆస్తులు కూడబెట్టుకోవడంపైనే ఉందని విమర్శించారు. గొడ్డలి పార్టీ గతంలో చేసిన అరాచకాలు, అకృత్యాలపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కూటమి కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలను అడ్డుకోవడానికి ఏకంగా 62 పిటిషన్లు వేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, న్యాయస్థానం కూడా వారి కుట్రలను తిరస్కరించిందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు



"సుపరిపాలన" అనే నినాదాన్ని విశ్వసించి ఎన్డీఏ కూటమికి చరిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కేవలం 28 నెలల కాలంలోనే తమ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించడం, పేదలకు ఇళ్ల పట్టాలు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం, గుంతలు లేని రోడ్ల నిర్మాణం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం బటన్లు నొక్కడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టలేదని ఎద్దేవా చేశారు. క్యాలెండర్ ప్రకారం సంక్షేమ ఫలాలను అందిస్తుండటంతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యత అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. మూడు పార్టీలు ఉన్నప్పుడు కొన్ని చిన్న చిన్న సమస్యలు సహజమని, అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం వాటిని అధిగమించాలని సూచించారు. పార్టీ అధినేతలు చర్చించి ఖరారు చేసిన అభ్యర్థుల విజయానికే అందరూ కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా రెబల్స్‌గా, స్వతంత్రులుగా పోటీలో నిలవడం కూటమి ధర్మానికి పూర్తిగా విరుద్ధమని, అలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. టికెట్లు ఆశించి భంగపడిన వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాల ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అర్నబ్ తుపాను రూపంలో రాష్ట్రం ఒక విపత్తును ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలిపారు. ఒకవైపు తుపాను సహాయక చర్యలను సమీక్షిస్తూనే, మరోవైపు పార్టీ వ్యవహారాలకు, ఎన్నికల వ్యూహాలకు సమయం కేటాయిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ బలంగా ఉందని, ఇప్పుడు స్థానిక సంస్థలను కూడా గెలుచుకుని "ట్రిపుల్ ఇంజిన్ సర్కార్" ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు.. ఇలా అన్నీ కైవసం చేసుకుని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్ల శాతాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమయం తక్కువగా ఉన్నందున అత్యంత చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపును ఖరారు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి

మొదటి పేజీ తరువాయి

గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు.. పలు జిల్లాల్లో భారీగా ఆస్తి, పంట నష్టం అర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో దెబ్బతిన్న రహదారి, కూలిపోయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సహాయక చర్యలను

మరింత పకడ్బందీగా చేపట్టాలి. తుపాను ప్రభావం తగ్గాక పంట నష్టం అంచనాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలి. చెరువుల గట్లు, వాగులు, వంకల్లో వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలి" అని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

గంటకు 140 కి.మీ. వేగంతో గాలుల బీభత్సం

ఈ సమీక్ష సందర్భంగా, అధికారులు తుపాను పరిస్థితిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. యానాంకు దక్షిణంగా అర్ధరాత్రి 1:20 గంటలకు ప్రారంభమైన తీరం దాటే ప్రక్రియ ఉదయం వరకు కొనసాగిందని తెలిపారు. ఈ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకాయని పేర్కొన్నారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ గాలుల విధ్వంసం అధికంగా ఉందని అధికారులు నివేదించారు. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయాయని వివరించారు. గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్లు తెలిపారు. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే 93 రహదారులు దెబ్బతినగా, 736 చెట్లు నేలకొరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో రోడ్లపై కూలిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులు తక్షణమే ప్రారంభించామని కలెక్టర్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉన్నారని, జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

తుఫాను బీభత్సం



బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?:

మొదటి పేజీ తరువాయి

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది.

ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

'ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?'..

రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

మొదటి పేజీ తరువాయి

టాటా గ్రూప్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. ఆ సంస్థను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడొద్దని, వాణిజ్య, న్యాయపరమైన విషయాలను నేరాలుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు. 'ప్రతిచోటా దెయ్యాలను వెతకడం మానుకోండి' అంటూ ఎక్స్ వేదికగా చురకలంటించారు. టాటా గ్రూప్ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వ్యాపార ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. తమ దాకా వస్తే గానీ తెలియదా? అంటూ విమర్శించారు. భారత వ్యాపార రంగం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లోని ఆటబొమ్మ కాదని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. భారత పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల విజయాలను కాంగ్రెస్ పదేపదే తక్కువ చేసి చూపుతోందని విమర్శించారు. వ్యాపార రంగంలో అవిశ్వాసం, విషపూరిత వాతావరణం వ్యాప్తి చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోని లైసెన్స్-కోటా విధానం పారిశ్రామికవేత్తల స్వేచ్ఛను దెబ్బతీసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించాలన్న నిర్ణయంపై వివాదం నెలకొంది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేశారు. ఆ నిర్ణయం చెల్లదని, నిబంధనల ప్రకారం జరగలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

పులివెందుల ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ సవాళ్లు: మంత్రి సత్యకుమార్

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటా, ఎవరొస్తారో రండి చూస్తానంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడప జిల్లాలో, ముఖ్యంగా పులివెందులలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి పార్టీ ఎదుర్కొన్న పరాభవాన్ని జీర్ణించుకోలేక, పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టడానికే జగన్ ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. "నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి కడపలో సీన్ రివర్స్ అయి తాను, తన పార్టీ 'పడక' ఎక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టే దురుద్దేశం ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైంది" అని విమర్శించారు. దశాబ్దాలుగా తన కుటుంబం అనుసరించిన హింసా రాజకీయాలనే జగన్ కొనసాగించాలనుకుంటున్నారని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ల సమయంలో ప్యాలెస్‌కు పరిమితమై, విత్ డ్రాయల్స్ సమయంలో ముఖం చాటేసి, అన్నీ అయిపోయిన తర్వాత ఇప్పుడు చొక్కా మడతపెట్టడంలో ఆంతర్యం ఏమిటి?" అని సత్యకుమార్ నిలదీశారు. ఎన్నికలను వాయిదా వేయించడానికి జగన్ చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు అడ్డుకుందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జగన్ తనను తాను సంస్కరించుకుని, ప్రజాస్వామ్యవాదిగా మారే ప్రయత్నం చేయాలని హితవు పలికారు.

రక్షణ

గురువారం 29 అక్టోబర్ 2026

అమ్మాయిలు అదరహో.. జింబాబ్వేపై భారత్ క్లీన్ స్వీప్

జింబాబ్వేతో మూడో వన్డేలో భారత్‌కు 8 వికెట్ల తేడాతో విజయం

మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా

26 బంతుల్లో హాఫ్ సెంచరీతో మెరిసిన షఫాలీ వర్మ

బౌలింగ్‌లో ఐదు వికెట్లతో చెలరేగిన వైష్ణవి శర్మ

భారత్ చేతిలో వన్డే, టీ20 సిరీస్‌లు కోల్పోయిన జింబాబ్వే

భారత మహిళల క్రికెట్ జట్టు జింబాబ్వేపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వడోదరలోని బీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వేను భారత బౌలర్లు 131 పరుగులకే కట్టడి చేశారు. వైష్ణవి శర్మ 39 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి తన వన్డే కెరీర్‌లో తొలిసారి ఈ ఘనత సాధించింది. సయాలీ సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు తీశారు. జింబాబ్వే జట్టులో మోడెస్టర్ ముపాచిక్వా (37), జోసెఫిన్ కోమో (35) మాత్రమే రాణించారు. అనంతరం 132 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, కేవలం 17 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. షఫాలీ వర్మ 26 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలవగా, మరో ఓపెనర్ ప్రతికా రావల్ (59 నాటౌట్) నిలకడగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చింది. ఈ క్రమంలో షఫాలీ.. వన్డేల్లో భారత మహిళల తరఫున అత్యంత వేగంగా రెండో హాఫ్ సెంచరీ (రిచా ఘోష్‌తో సమానంగా) నమోదు చేసింది. యస్తికా భాటియా డకౌట్ కాగా, హర్లీన్ డియోల్ 19 పరుగులు చేసింది. అంతకుముందు టీ20 సిరీస్‌ను కూడా గెలుచుకున్న భారత్, ఒక్క ఓటమి కూడా లేకుండా రెండు సిరీస్‌లను సొంతం చేసుకుంది. మరోవైపు, జింబాబ్వే జట్టు ఒక్క విజయం కూడా నమోదు చేయకుండానే పర్యటనను ముగించింది.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నం.1గా అభిషేక్

నాలుగేళ్ల జడేజా ఆధిపత్యానికి బ్రేక్ వేసిన యాన్సెన్

ఐసీసీ తాజాగా విడుదల చేసిన తాజా ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. భారత యువ సంచలనం అభిషేక్ శర్మ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ టెస్టుల్లో ఏకకాలంలో నంబర్ 1 బౌలర్‌గా, నంబర్ 1 ఆల్‌రౌండర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లో ఈ రెండు కేటగిరీల్లోనూ యాన్సెన్ అగ్రస్థానానికి చేరడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియాతో గెబెర్హాలో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా విజయంలో యాన్సెన్ కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో 85 పరుగులు చేయడమే కాకుండా, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో టెస్ట్ బౌలింగ్ చార్టులో ఐదు స్థానాలు ఎగబాకి ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్‌ను అధిగమించాడు. ఇక, ఆల్‌రౌండర్ల విభాగంలో యాన్సెన్ భారత స్టార్ రవీంద్ర జడేజాను వెనక్కి నెట్టి అగ్రపీఠాన్ని అధిరోహించాడు. గత నాలుగేళ్లకు పైగా జడేజానే టెస్ట్ ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్ 1గా కొనసాగుతుండటం గమనార్హం. మరోవైపు, టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో టీ20ల్లో మళ్లీ సింహాసనాన్ని దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్‌టన్‌లో జరిగిన మూడో టీ20లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, మొత్తం 38 బంతుల్లో 113 పరుగులు సాధించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఫలితంగా సహచర ఆటగాడు ఇషాన్ కిషన్‌ను అధిగమించి తిరిగి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. అభిషేక్ తొలిసారిగా 2025 జులైలో ఈ ఘనత సాధించాడు. అలాగే సంజూ శాంసన్ ఆరు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంకుకు చేరుకోగా, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 15వ స్థానానికి చేరాడు. ఇక, టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 179 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలవడం అతనికి కలిసొచ్చింది. ఈ జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాత్రమే అతని కంటే ముందున్నాడు.

ఇంగ్లండ్ ఆటగాడితో వాగ్వాదం

పాక్ బౌలర్‌కు భారీ జరిమానా.. ఇంకోసారి జరిగితే నిషేధమే!

పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ హరీస్ రవూఫ్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షాక్ ఇచ్చింది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. అంతేకాదు.. అతడి ఖాతాలో మరో డీమెరిట్ పాయింట్ చేరింది. దీంతో మొత్తం పాయింట్లు ఐదుకు చేరాయి. ఇప్పటికే గతంలో నిషేధం ఎదుర్కొన్న రవూఫ్.. మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

అసలేం జరిగింది?

ఇంగ్లండ్‌తో ఆదివారం లాహోర్‌లో జరిగిన వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఇన్నింగ్స్ 46వ ఓవర్ ముగిసిన సమయంలో వైడ్ కోసం రవూఫ్ అప్పీల్ చేశాడు. ఈ విషయంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్‌తో వాగ్వాదానికి దిగాడు. అంపైర్ షర్ఫుద్దౌలా హెచ్చరించినా రవూఫ్ వెనక్కి తగ్గలేదు. బ్యాట్ పైకెత్తుతూ వాదన కొనసాగించాడు. జాక్స్ వైపు వెళుతూ అంపైర్‌ను తాకుతూ ముందుకు సాగాడు. ఈ వ్యవహారాన్ని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది.

ఐదు డీమెరిట్ పాయింట్లు

24 నెలల వ్యవధిలో రవూఫ్ మూడోసారి తప్పిదానికి పాల్పడ్డాడు. తాజా చర్యతో అతడి ఖాతాలో ఐదు డీమెరిట్ పాయింట్లు చేరాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ వ్యవధిలో నాలుగు పాయింట్లు వస్తే రెండు సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. దాని ప్రకారం ఒక టెస్టు లేదా రెండు వన్డేలు లేదా రెండు టీ20లపై నిషేధం పడుతుంది. ఎనిమిది డీమెరిట్ పాయింట్లకు చేరితే శిక్ష మరింత పెరుగుతుంది. ఇదే మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కూ జరిమానా పడింది. నిర్ణీత సమయంలో మూడు ఓవర్లు తక్కువగా వేసినందుకు ఆ జట్టు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్, రవూఫ్ తమపై వచ్చిన అభియోగాలను అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఐసీసీ శిక్షలు ఖరారు చేసింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఒక్క వికెట్ తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. షాదాబ్ ఖాన్ అజేయ సెంచరీకి తోడు చివరి వికెట్‌కు రవూఫ్‌తో కలిసి 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.



క్రీడాలోకంలో విషాదం

మూడుసార్లు పారా గేమ్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ యాదవ్ బలవన్మరణం

భారత క్రీడా రంగంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆసియా పారా గేమ్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించి దేశ కీర్తిని పెంచిన స్టార్ అథ్లెట్ నీరజ్ యాదవ్ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఢిల్లీలోని తన నివాసంలో బుధవారం విషం తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో భారత క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఢిల్లీలోని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని భారత పారా-అథ్లెటిక్స్ జట్టు హెడ్ కోచ్ ఎస్. సత్యనారాయణ ధ్రువీకరించారు. "నీరజ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరం. ఇలా జరగడం బాధాకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఆసియా పారా గేమ్స్‌కు డోపింగ్ నిషేధం కారణంగా నీరజ్ యాదవ్ అర్హత కోల్పోయారు. ఈ కారణంగానే ఆయన తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే, ఆయన ఆత్మహత్యకు దారితీసిన కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. "ఆయన ఆత్మహత్యకు కారణం ఇదేనని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ, ఒక క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించగలగాలి. ఆయన ఇలాంటి తీవ్ర నిర్ణయం తీసుకోవడం విచారకరం" అని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ప్రతిభావంతులైన పారా అథ్లెట్లలో నీరజ్ యాదవ్ ఒకరు. 2018 జకార్తా ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించాడు. 2023లో హాంగ్‌జౌలో జరిగిన క్రీడల్లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు గెలిచి చరిత్ర సృష్టించాడు.

ధోనీని తొలగించి స్మిత్‌కు కెప్టెన్సీ

ఆ నిర్ణయంతో అందరం షాకయ్యాం: డుప్లెసిస్

భారత క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీని 2017 ఐపీఎల్ సీజన్‌కు ముందు రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి అకస్మాత్తుగా తొలగించినప్పుడు డ్రెస్సింగ్ రూమ్‌లోని ప్రతి ఒక్కరూ షాక్‌కు గురయ్యారని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ వెల్లడించాడు. ధోనీ స్థానంలో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్‌కు పగ్గాలు అప్పగించడం అందరినీ ఆశ్చర్యపరిచిందని, అప్పటి ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా ఈ నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేసుకున్నాడు. క్రిక్‌ఇన్ఫో నిర్వహించిన 'క్రికెటర్స్ ఆన్ క్రికెటర్స్' షోలో డుప్లెసిస్ మాట్లాడుతూ, "2016 సీజన్ తర్వాత ధోనీని కెప్టెన్‌గా తొలగించారు. ఆ నిర్ణయంతో మేమంతా షాకయ్యాం. అంత పెద్ద టోర్నమెంట్‌లో అది అతిపెద్ద నిర్ణయం. ధోనీ స్థానంలో స్టీవ్ స్మిత్ కొత్త కెప్టెన్ అయ్యాడు" అని తెలిపాడు. "అప్పటికి స్మిత్‌కు కెప్టెన్‌గా అంత అనుభవం లేదు. అయినా జట్టును అద్భుతంగా నడిపించాడు. కెప్టెన్‌గా తొలగించిన ధోనీ లాంటి దిగ్గజం జట్టులో ఉండటం స్మిత్‌కు కఠినమైన సవాలే. అయినప్పటికీ స్మిత్ ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. అతని నాయకత్వంలో జట్టు 2017 ఐపీఎల్ ఫైనల్‌కు చేరింది. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలయ్యాం. నిజానికి మేం గెలవాల్సిన ఫైనల్ అది. గెలిచి ఉంటే, కెప్టెన్ గా తొలి సీజన్‌లోనే ఐపీఎల్ టైటిల్ సాధించిన ఆటగాడి స్మిత్ నిలిచేవాడు" అని డుప్లెసిస్ వివరించాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ కుంభకోణం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లపై రెండేళ్ల నిషేధం పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వాటి స్థానంలో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్, గుజరాత్ లయన్స్ జట్లను తాత్కాలికంగా ప్రవేశపెట్టారు. రెండేళ్ల తర్వాత జూఖ, జట్లు తిరిగి రావడంతో పుణే, గుజరాత్ ఫ్రాంచైజీలు రద్దయ్యాయి. ఆ తర్వాత ధోనీ తిరిగి చెన్నై జట్టుకు కెప్టెన్‌గా వెళ్లి 2018, 2021, 2023లో టైటిల్స్ అందించాడు. ఇక, అప్పట్లో పుణే ఫ్రాంచైజీ యజమానిగా ఉన్న సంజీవ్ గోయెంకా, ప్రస్తుతం లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు యజమానిగా ఉన్నారు.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District